క్లుప్తంగా

రోగులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైద్యాధికారి గౌరి

శ్రీరంగరాజపురం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి గౌరి ఆధ్వర్యంలో రోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆమె మట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 8లీటర్ల నీరు సేవించాలని సూచించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



పాఠ్య పుస్తకాలు అందుకొన్న విద్యార్థులు

పుత్తూరు: విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.గోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం సీనియర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచే తరగతులు ప్రారంభించామని తెలిపారు. సీనియర్ విద్యార్థులు తమ గ్రామాల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను కళాశాలలో చేర్పించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీ నిధులు నిరుపయోగంగా ఉన్నాయి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

పుత్తూరు: మండల పరిషత్‌లో అభివృద్ధి నిధులు రూ.70 లక్షలు నిరుపయోగంగా ఉన్నాయని ఎంపీపీ మునివేలు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా నివేదించారు. ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ అధికారులు గత కొన్ని నెలలుగా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. అలాగే ప్రోటోకాల్ పాటించడం లేదని తెలిపారు. కార్యాలయంలోనూ అధికారులు అందుబాటులోకి రావడం లేదన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీకామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగునోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కరకంఠేశ్వర స్వామిని నంది వాహనంపై ఊరేగించారు. గతంలో మాజీ మంత్రి ఆర్కేరోజా రూ.1.80 లక్షలు వెచ్చించి సిద్ధం చేసి ఆలయానికి అందించిన వృషభ(నంది) వాహనంపై స్వామిని ఊరేగించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెడ్డి సంక్షేమ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

వేణుగోపాలుని సన్నిధిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కార్వేటినగరం: శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన సురేష్‌బాబు, జాహ్నవి కుటుంబ సభ్యులు సోమవారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు నిరీక్ష, కీర్తన, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ ఫార్మర్ చోరీ

పుత్తూరు: పరమేశ్వరమంగళం గ్రామంలోని పంట పొలాల్లోని 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. సోమవారం ఉదయం యథావిధిగా రైతులు మోటార్లు వేయగా అవి పనిచేయకపోవడంతో సరఫరా లేదని భావించారు. సాయంత్రం వరకు పరిస్థితి అలాగే కొనసాగడంతో రైతులు విచారించగా సరఫరా ఉదయం నుంచి ఉందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు పరుగులు పెట్టిన రైతులు చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.



పార్కంతా చెత్తమయం



ఎటుచూసినా ఎండిన మొక్కలు



మరమ్మతులకు గురైన పరికరాలు

శిథిల ఉద్యానవనం

- నాడు కళకళ–నేడు వెలవెల
- మరమ్మతులకు గురైన క్రీడా పరికరాలు
- పార్కునిండా చెత్తాచెదారం
- తాగునీరు, మరుగుదొడ్లు లేక సందర్శకుల పాట్లు
- పాములు చేరుతున్నాయంటూ తల్లిదండ్రుల ఆందోళన



స్వింగ్ కోసం వెయిటింగ్



జారుడు బండ

పుత్తూరు: వైఎస్ఆర్ మున్సిపల్ పార్కు చెత్తా చెదారంతో అందవిహీనంగా తయారైంది. ఆహ్లాదాన్ని అందించాల్సిన ఉద్యానవనం సందర్శకులకు సమస్యల వలయంగా మారింది. ఎటు చూసినా చెత్తాచెదారంతో పాటు, ఎండిపోయిన మొక్కలతో కళావిహీనంగా కనబడుతోంది. పిల్లలు ఆడుకొనే జారుడు బండ పెద్ద చిల్లు పడి పిల్లలు గాయాల పాలవుతున్నారు. రెండు ఊయలల్లో ఒకటి మరమ్మతులకు గురికాగా దానిని పూర్తిగా తొలగించడంతో ప్రస్తుతం ఒక్కటి మాత్రమే పిల్లలకు అందుబాటులో ఉంది. మొక్కలకు నీరు పట్టకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. పార్కు నిండా గడ్డి పొదలు పెరిగిపోవడంతో పాములు సైతం చేరుతున్నాయి. ఇటీవల పార్కులో పామును చూసి తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురై పిల్లల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య రానురాను తగ్గిపోతోంది.

చిరకాల స్వప్నం సాకారం

పుత్తూరు ప్రజల చిరకాల స్వప్నమైన పార్కును అందించిన ఘనత మాజీ మంత్రి ఆర్కే రోజాకు దక్కుతుంది. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఆమె చొరవతోనే 1.80 ఎకరాల సువిశాల ప్రదేశంలో రూ.1.10 కోట్లతో వైఎస్ఆర్ మున్సిపల్ పార్కును ఏర్పాటు చేశారు. ఆహ్లాదభరిత వాతావరణంలో ఎంతో అందంగా ఏర్పాటు చేసిన పార్కును 2022 మార్చి 18వ తేదీన ఆమె చేతుల మీదుగానే ప్రారంభించబడింది. ఫలితంగా పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పెద్దలు, పిల్లలు, యువకులు పార్కుకు వచ్చి ఆనందంగా గడిపేవారు. సెలవు రోజుల్లో అయితే పిల్లలు, పెద్దలతో పార్కు నిండిపోయేది. పార్కులో పిల్లలకు ఆట వస్తువులు, యువకులను జిమ్, వృద్ధులకు వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలతో నాడు పార్కు కళకళలాడేది. నేడు ఇందుకు భిన్నంగా పార్కు చెత్తగా తయారైంది. మున్సిపాలిటీవారు నిర్వహణ బాధ్యతలను గాలికి వదిలేశారు. ఉన్న ఏకైక పార్కును ఇలా నిర్లక్ష్యం చేస్తారా అంటూ సందర్శకులు విమర్శిస్తున్నారు.

జిమ్ పరికరాలను బాగు చేయాలి



పార్కులోని జిమ్ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేయించాలి. అలాగే పార్కును ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. అప్పుడే సందర్శకుల రాక పెరుగుతుంది.

–జగన్మోహన్‌రావు, పుత్తూరు

నిర్లక్ష్యం తగదు



పుత్తూరు పట్టణానికి చెందిన ఏకైక పార్కు నిర్వహణపై నిర్లక్ష్యం తగదు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు, పెద్దలు ఎక్కువగా వస్తుంటారు. పిల్లల క్రీడా పరికరాలు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేయించాలి. –గోవిందరాజులు, విశ్రాంత ఉద్యోగి, పుత్తూరు

పాముల బెడద లేకుండా చూడాలి



పార్కుకు నేను ప్రతిరోజూ వస్తుంటాను. ఇప్పటికి రెండు పర్యాయాలు పాములను చూశాను. పిల్లలు ఎక్కువగా వస్తుంటారు. కనుక పాముల బెడద లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

–లత, లక్ష్మీనగర్ కాలనీ, పుత్తూరు

మౌలిక వసతులు కల్పించాలి



ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో సందర్శకులు పార్కుకు వస్తున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో కొందరు ఆకతాయిలు పార్కులోకి ప్రవేశించి మద్యం తాగి, పార్కును అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. ఈ విషయాలపై కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్‌గా ప్రస్తావించాను. చైర్మన్, కమిషనర్ పార్కు పరిరక్షణకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. –రాధ, వార్డు కౌన్సిలర్, పుత్తూరు

పూడి రైల్వే గేటు మూత

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం, పూడి రైల్వే గేటు మరమ్మతుల కారణంగా 8, 9వ తేదీ రెండు రోజులు రాత్రి 8 నుంచి ఉదయం 6 గంటలకు మూసివేయనున్నట్లు రైల్వే శాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు పగటి పూట యథావిధిగా తెరిచి ఉంటుందని, రాత్రి 8 నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే మూసి వేయనున్నట్లు తెలిపారు. అత్యవసర వాహనం 108, అంబులెన్స్‌లతో పాటు వాహనదారులు చెన్నై–తిరుపతి జాతీయ రాహదారి మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు.

పెరటి తోటలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

నగరి: పెరటి తోటలతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చని వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న వెలుగు కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం తినాలంటే పెరటి తోటలు వేసుకుని అందరు కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలన్నారు. ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ డీఎంటీలు చంద్రశేఖర్, నీలకంఠారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని 9 సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలోఎన్ఎఫ్ఏ నాంచారమ్మ, ఈవోపీఆర్డీ, ఏపీఎం, ఆర్ఎస్‌కే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, పుండరీకం, అమల, ఐసీఆర్పీలు, వీఓఓబీలు, ఎంఎస్ఓబీలు, రైతులు పాల్గొన్నారు.

డైయింగ్ యూనిట్లను తరలించండి



కోర్టు వద్ద అఖిలపక్ష నేతలు

నగరి: ప్రజలకు అనారోగ్యాన్ని కలిగించే డైయింగ్ యూనిట్లను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటూ రసాయన రంగు నీటి వ్యతిరేక పోరాట అఖిల పక్ష కమిటీ సభ్యులు సోమవారం నగరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం అర్జీలు ఇవ్వడానికి కేటాయించిన సమయంలో వారు ఈ మేరకు అర్జీని సమర్పించారు. అనంతరం కోర్టు వెలుపల వారు మాట్లాడుతూ తమిళనాడులో ప్రజలకు హానికరమని డైయింగ్ యూనిట్లను మూసివేశారని, ఇక్కడ కూడా ప్రజలకు హానికరమేనని తెలిపారు. డైయింగ్ యూనిట్లు నివాస ప్రాంతాల్లో లేకుండా చేసి ప్రజలకు న్యాయం చేయాలని అర్జీలో పేర్కొన్నామన్నారు. సంబంధిత డైయింగ్ యూనిట్ యజమానులకు, అధికారులకు ఈ అంశంపై విచారించాలని కోరామన్నారు. హానికర రసాయనాలు కలిసిన నీటిని మురుగు కాలువలతోపాటు, నీటిపారుదల కాలువలు, చెరువులు, గుంటలు, కుశస్థలి నదిలో వదిలేస్తున్న వివరాలను, అనారోగ్య బాధితుల వివరాలను అందజేశామన్నారు. తమిళనాడులో నిషేధించిన యూనిట్లు చాప కిందనీరులా నగరిలో వచ్చి ఆవహించాయని వాటిని ఇక్కడ కూడా నిషేధించి ప్రజలకు న్యాయం చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ అధ్యక్షుడు గజేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పుత్తూరు: పట్టణ పరిధిలోని అన్ని గ్రామాల శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేయాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ గౌడ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణ పరిధిలో 49 శ్మశానాలు ఉండగా అన్నింటిలోనూ ముళ్ల కంపలు పెరిగిపోయి చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయని, అన్నింటిని శుభ్రపరచాల్సి ఉందన్నారు. పలు శ్మశానాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందుకోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు సైతం చేపడుతున్నారని తెలిపారు. 10 శ్మశానాల్లో బోర్లు వేసి మోటర్లు బిగించకుండా వదిలేశారని తెలిపారు. కొన్ని చోట్ల శ్మశాన భూముల ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్పందించి అన్ని శ్మశానాలను అభివృద్ధి చేయాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మురగారెడ్డి

జన్మభూమిని మరువలేం



స్వగ్రామంలో పర్యటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: జన్మభూమి రుణం తీరదని, పుట్టిన ఊరుని ఎప్పటికీ మరువలేమని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సోమవారం ఆయన స్వగ్రామం పాదిరికుప్పంలో పర్యటించారు. చిన్ననాటి మిత్రులను పలకరించారు. పలువురికి ఆర్థికసాయం అందించారు. నారాయణ స్వామి మాట్లాడుతూ సర్పంచ్ స్థాయి నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి చేర్చిన పాదిరికుప్పానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. దళిత నేతగా ఊరు కోసం చేసిన పోరాట ఫలితమే నేడు పాదిరికుప్పానికి నియోజకవర్గంలో ప్రత్యేకత తీసుకువచ్చిందని చెప్పారు. గ్రామస్తులు, సోదరులు, స్నేహితుల సహకారంతోనే ఊరును ఇంతలా అభివృద్ధి చేయగలిగామని వివరించారు. డిప్యూటీ సీఎంగా గ్రామానికి అందించిన సేవలు నేడు మధుర జ్ఞాపకాలు కళ్ల ముందు కనిపిస్తున్నాయని వెల్లడించారు.

పలువురికి పరామర్శ

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తన పర్యటనలో భాగంగా పలువురిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన చిన్నయ్య భార్య వనజ కుటుంబీకును ఓదార్చారు. శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులు కుమార్తె సంజీవమ్మను పరామర్శించారు. అలాగే తన చిన్ననాటి స్నేహితులు మునినాథయ్య, చెంగయ్య అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న వారి ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు విచారించారు. ఆర్థిక సాయం అందించారు. అలగే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న టీడీపీ నేత వి.దామోదరం, రోడ్డు ప్రమాదంలో గాయపడిన టి.చంద్రశేఖర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, జేసీఎస్ కన్వీనర్ పురందర్, దేశయ్య, వెంకటస్వామి, శ్రీనివాసులు, కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, దేశవయ్య, దాము, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, వెంకటరత్నం, ఆన్నూరు సర్పంచ్ ఆదామ్ (సుందర్‌రాజు), అడ్వొకేట్ స్టీఫెన్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని ఆందోళన





జాతీయ రహదారిని దిగ్బంధించిన విద్యార్థులు, విద్యార్థులతో చర్చిస్తున్న సీఐ విక్రమ్

నగరి: కళాశాలకు సంబంధించిన స్థలాన్ని జాతీయ రహదారి ఏర్పాటు నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు. అయితే నిబంధనల మేరకు కళాశాలకు చెల్లించాల్సిన నష్టపరిహారం చెల్లించలేదు. నష్టపరిహారం చెల్లించకనే సోమవారం పనులు ప్రారంభించడంతో ఆగ్రహానికి లోనైన ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు రోడ్డెక్కారు. జాతీయ రహదారిని దిగ్బంధించారు. నష్టపరిహారం చెల్లించాలంటూ రాకపోకలను ఆపేశారు. దీంతో రోడ్డుపై సుదూరం వరకు వాహనాలు ఆగిపోయాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ విక్రమ్ ప్రిన్సిపల్, విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలకు నష్టపరిహారం చెల్లించడం, చెల్లించకపోవడం అన్నది కళాశాలకు జాతీయ రహదారి అధికారులకు సంబంధిత అంశమని, అది వారి మాట్లాడి తేల్చుకోవాలని కోరారు. ఇలా రోడ్డెక్కి అందరికీ ఇబ్బంది కలిగించకూడదని హితవు పలికారు. అనుమతి లేకుండా జాతీయ రహదారిని నిర్బంధించడం నేరమన్నారు. దీంతో వారు తరగతులకు వెళ్లిపోయారు.

రోగులకు మందులు పంపిణీ



మందులు అందిస్తున్న అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): సహకార సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. పెనుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా సహకార శాఖాధికారి వనజ హాజరయ్యారు. సీఈఓ మురుగన్, పీఏసీ ప్రసాద్, ఆడిటర్ రమణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా వ్యవహరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా రాచపాళ్యెం, గుండుబావి గ్రామాల్లో పర్యటించారు. ప్రజలకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరుణోదయ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, హెచ్ఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తూగుండ్రం పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణమ్మ, ఎంపీహెచ్ఈఓ రియాజ్, పీహెచ్ఎన్ శాంతి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

- ఇష్టారాజ్యంగా తమిళనాడుకు తరలింపు
- విచ్చలవిడిగా నీవానదిలో 'సైకతం'
- పట్టించుకోని అధికార యంత్రాంగం





ట్రాక్టర్‌లో తమిళనాడుకు తరలిస్తున్న ఇసుక, తడుకు ఆర్ఎస్ మీదుగా అడ్డ దారిలో ఎస్‌బీఆర్‌పురం వెళ్తున్న గ్రావెల్

పాలసముద్రం: మండలంలోని నీవానది పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి నేతల కనుసన్నల్లో దందా కొనసాగుతోంది. ప్రధానంగా వనదుర్గాపురం నుంచి తమిళనాడుకు నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిపోతోంది.

ఉచితం పేరిట దందా

టీడీపీ నేతలు ఉచితం పేరుతో ఇసుకను కొల్లగొడుతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.7కోట్లు మంజూరైనట్లు కలరింగ్ ఇస్తున్నారు. వర్క్ ఆర్డర్లు లేకుండానే ఇసుకను తవ్వకుని సరిహద్దులు దాటిస్తున్నారు. అందులో భాగంగా ఒక్క వనదుర్గాపురం గ్రామంలోనే దాదాపు 200 లోడ్ల ఇసుకను డంప్ చేశారు. ట్రాక్టర్ ఇసుక రూ.15వేల చొప్పున రాత్రివేళల్లో తమిళనాడుకు తోలేస్తున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు

వనదుర్గాపురంలోని ఓ టీడీపీ నేత మొత్తం వ్యవహారం నడిపిస్తున్నారు. ఇసుక రవాణా చేయాలంటే స్థానిక పోలీస్ స్టేషన్ మీదుగానే తీసుకెళ్లాలి. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలింపు సాగుతున్నప్పటికీ పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలంను ఆనుకొని పుత్తూరు సరిహద్దు ప్రాంతంలో ఉన్న తడుకు, వేణుగోపాలపురం కొండ నుంచి వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం గ్రామానికి అడ్డదారిలో కొందరు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ వ్యవహారం గత రెండు రోజులుగా సాగుతున్నాయి. అయినా రెండు మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఆదివారం సెలవు దినంలో కూడా విచ్చలవిడిగా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకొంటున్నారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అక్రమ గ్రావెల్ క్వారీ తరలింపు వెనుక టీడీపీ నాయకుల అండ ఉండడంతో అధికారులు ప్రశ్నించలేక పోతున్నారు.

గోరంత అనుమతి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నాయకులు అక్రమ వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. తమ పలుకుబడిని ఉపయోగించుకొని స్థానిక తహశీల్దార్ దగ్గర 10 లేదా 20 ట్రాక్టర్‌లకు అనుమతి తీసుకొని, వాటి ఆధారంగా వందల సంఖ్యలో ట్రాక్టర్లతో గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకొంటున్నారన్న ఆరోపణ గట్టిగా వినిపిస్తోంది. అనుమతి ఇచ్చిన రెవెన్యూ సిబ్బంది అటువైపు వెళ్లకుండా మామూళ్లతో అడ్డుకుటుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అక్రమ గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.